ప్రజాశక్తి
బుధవారం 6 ఆగస్టు 2025
5
అల్లూరి సీతారామరాజు



పిహెచ్‌సి ఆకస్మిక పరిశీలన



రిజిస్టర్ పరిశీలిస్తున్న పిఒ సింహాచలం

ప్రజాశక్తి - దేవీపట్నం: దేవీపట్నం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా పరిశీలించారు. పిహెచ్‌సిలో ఎంతమంది వైద్యాధికారులు, ఎంతమంది సిబ్బంది, ఎంతమంది క్షేత్రస్థాయి అధికారులు సిబ్బంది ఉన్నది ముందుగా పిఒ సింహాచలం ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టుకుని రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. ఎంతమంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు, ప్రస్తుతం ఎంతమంది రోగులు ఉన్నదీ అడిగి తెలుసుకున్నారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు.

స్మార్ట్‌మీటర్లపై భగ్గు

అదాని స్మార్ట్‌మీటర్లపై ప్రజాగ్రహం పెల్లుబికుతోంది. ప్రజలపై భారాన్ని మోపే సంస్కరణలను రద్దు చేయాలని, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు ఛార్జీలను ఉపసంహరించుకోవాలని సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అల్లూరి జిల్లాలో మంగళవారం విద్యుత్ శాఖ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. వీటిలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భారాలు మోపితే సహించేది లేదని హెచ్చరించారు.

- సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు
- సబ్‌స్టేషన్ల ముట్టడి
- విద్యుత్ శాఖాధికారులకు వినతిపత్రాల అందజేత



రంపచోడవరం: వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - రంపచోడవరం : స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని కోరుతూ మంగళవారం రంపచోడవరంలో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని, ప్రజలపై భారాన్ని మోపే సంస్కరణలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో చెక్‌పోస్టు సెంటర్ నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా ఐటిడిఎ విద్యుత్‌సబ్‌స్టేషన్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించి స్మార్ట్ మీటర్లను తొలగించాలని నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్‌శాఖ ఎడిఇకి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం కార్యదర్శి కొంచెం దూలయ్య, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తాటి బిల్లబ్బాయి, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వంజం జోగారావు, రైతు కూలి సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి, ఏఐఎంఎస్ జిల్లా నాయకులు లచ్చిరెడ్డి, పిఒడబ్ల్యు నాయకులు అనసూయ, గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లు, సర్దుబాటుఛార్జీలు ఉపసంహరించుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో బుట్టాయగూడెం సబ్‌స్టేషన్‌వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఎఇ సూరిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కాకా అర్జున్‌దొర మాట్లాడుతూ సర్‌ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలే కాకుండా అదనంగా స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజల నడ్డి విరవడానికి ప్రభుత్వాలు సిద్ధమయ్యాయన్నారు. స్మార్ట్‌మీటర్ల ఆలోచన విరమించుకోకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఐవి, పులుసు బాలకృష్ణ, పడాల ఆంజయ్య, పూసం వెంకటరావు, బ్రహ్మం, సవలం రాముడు తదితరులు పాల్గొన్నారు.



చింతూరు : జెఇ సతీష్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

చింతూరు : స్మార్ట్‌మీటర్ల విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం చింతూరు కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపి అనంతరం వినతిపత్రం అందించారు. సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ (ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీ (ఎఫ్‌పిపిసిఎ)లతో పెద్దమోసం జరుగుతోందన్నారు. అనంతరం జెఇ సతీష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు సీసంసురేష్, మండల నాయకులు పొడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, కారం నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎటపాక : ఎఇ సూరిబాబుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

విఆర్‌పురం / కూనవరం : స్మార్ట్‌మీటర్ల నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని విఆర్‌పురం, కూనవరం సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో వినతిపత్రం అందించారు. సిపిఎం మండల కార్యదర్శి పులిసంతోష్‌కుమార్ మాట్లాడుతూ కరెంటు ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి కూటమి అధికారంలోకి వచ్చిందని బిల్లులు పెరిగితే ఆ పాపం మాది కాదని రాష్ట్ర ప్రభుత్వం తప్పించుకోవడం దుర్మార్గమన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జెఇకి అందించారు. కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, మండల నాయకులు కారం సుందరయ్య, ఎంపిటిసి పూణెం ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




అరకులోయ: విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన చేస్తున్న ప్రజాసంఘాలు

అరకులోయరూరల్: స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ సిపిఎం ప్రజాసంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు మంగళవారం అరకులోయ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, వైసిపి హయాంలో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును విపక్షంగా వ్యతిరేకించడమే కాకుండా, వీటిని ఏర్పాటుకొస్తే బద్దలు కొట్టాలని పిలుపునిచ్చిన నేటి కూటమి పార్టీల నేతలు, అధికారంలోకి వచ్చిన తర్వాత మాటమార్చి ప్రజలను మోసగించడం దుర్మార్గమన్నారు. అదాని సెకీ ఒప్పందాన్ని రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్లు బిగింపు నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో జరగబోయే ప్రజా ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జి బాబు, చిట్టం నాయక్, గురుమూర్తి, పాంగి నానిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఐసుబాబు, చిట్టిబాబు, జి గాసి, ఒ.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.



కూనవరం: సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీగా తరలివెళ్తున్న గ్రామస్తులు



విఆర్‌పురం: జెఇకి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

జాతీయస్థాయిలో రాణించాలి

- రాష్ట్రస్థాయి కబడ్డీ, టగ్‌ఆఫ్‌వార్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న జెన్‌కో చీఫ్ ఇంజనీర్ రాజారావు

ప్రజాశక్తి -సీలేరు: జాతీయస్థాయిలో (ఎపిఎస్‌సిబి) ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ ఉద్యోగులు పతకాలు సాధించాలని క్రీడాకారులకు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ కెవి రాజరావు ఆకాంక్షించారు. జికె వీధి మండలం సీలేరు ఎపి జెన్కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ, టగ్ ఆఫ్‌వార్ పోటీలు మంగళవారం ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. తర్వాత జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. డిఎవి పాఠశాల విద్యార్థులు కవాతు నిర్వహించి గౌరవ వందనం చేశారు. ఎపి జెన్కో ట్రాన్స్‌పోర్టు డిస్కం క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి గౌరవవందనం చేశారు. చీఫ్ ఇంజనీర్ రాజారావు మాట్లాడుతూ క్రీడాకారులు స్నేహపూర్వక వాతావరణంలో ఆడాలని, జాతీయస్థాయిలో మరిన్ని అవార్డులు తీసుకొచ్చేలా క్రీడాకారులను తీర్చిదిద్దాలని జెన్‌కో స్పోర్ట్స్ అధికారి వడివేలును కోరారు. సీలేరు కాంప్లెక్స్ ఎస్ఒ చిన్నకామేశ్వరరావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం తర్వాత పోటీలు నిర్వహించడానికి అనుమతించిన మేనేజ్‌మెంట్‌కు ధన్యవాదాలు తెలిపారు. కుమార్‌వడివేలు మాట్లాడుతూ ఇక్కడ జరిగిన పోటీల్లో రాష్ట్రం నుంచి కబడ్డీకి 16 జట్లు టగ్‌ఆఫ్‌వార్‌కి 17 జట్లు పాల్గొంటాయని పోటీలు లీగ్‌కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తామన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు సెప్టెంబరులో తెలంగాణ యాదగిరిగుట్టలో నిర్వహించే క్రీడలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఇన్చార్జి స్పోర్ట్స్ అధికారి రామకృష్ణ, ఎపి జెన్కో ఇఇలు రాజేంద్రప్రసాద్, నాగ శ్రీనివాసరావు, స్పోర్ట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీ డిఇఇ శ్రీనివాసరావు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ నాగేష్ ట్రెజరర్ లామ, క్యాంపు ఎడిఇ జైపాల్ పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఎడిఇ అప్పలనాయుడు, ఎఇలు సురేష్ ,అనుదీప్ డిఎవి హెచ్ఎం కిరణ్‌కుమార్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో మ్యాచ్‌కు అంతరాయం..

ముందుగా విజయనగరం-ఒంగోలు జట్లు కబడ్డీలో తలపడి హోరాహోరీగా మ్యాచ్ జరుగుతున్న సమయంలో వర్షం వర్షం కురిసి అంతరాయం ఏర్పడింది. కొంతసేపటి తరువాత తిరిగి మ్యాచ్ ప్రారంభించారు. విజయనగరం జట్టు 24 పాయింట్లు సాధించి సత్తా చాటింది. ఒంగోలు జట్టు 17 పాయింట్లకే పరిమితమై ఓటమి పాలైంది. లోవరుసీలేరు - తిరుపతి జట్లు తలపడగా లోవరు సీలేరు 31 పాయింట్లతో విజయం సాధించగా తిరుపతి జట్టు కేవలం 12 పాయింట్లకే పరిమితమైంది. పల్నాడు వర్సెస్ శ్రీకాకుళం జట్లు తలపడగా పల్నాడు 32 పాయింట్లుతో విజయం సాధించింది. శ్రీకాకుళం జట్టు 17 పాయింట్లకే పరిమితమైంది. సీలేరు- విటిపిఎస్ జట్లు తలపడగా విటిపిఎస్‌కు 33 పాయింట్లు రాగా సీలేరు 37 పాయింట్లతో విజయం సాధించింది.



కబడ్డీ ఆడుతున్న లోయర్ సీలేరు, తిరుపతి జట్లు

మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యం



ప్రిన్సిపల్స్‌కు సూచనలు చేస్తున్న ఆర్‌జెడి

ప్రజాశక్తి -అనంతగిరి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన విద్యాబోధనపై ప్రిన్సిపల్స్ దృష్టిసారించాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు ఎం ఆదినారాయణ, వృత్తివిద్య శాఖ డివిఇఒ ఎస్.భీమ శంకర్ సూచించారు.. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో పలు కాలేజీల ప్రిన్సిపల్స్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలో కళాశాలల ఉత్తీర్ణత ఫలితాలు పూర్తిగా తగ్గిపోయాయని, ఈ ఏడాది మెరుగైన ఉత్తమ ఫలితాల సాధనకు ఇప్పటినుంచి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు క్రమశిక్షణతోకూడిన నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు కార్యక్రమంలో స్థానిక కాలేజీ ప్రిన్సిపాల్ ప్రమీల, విశ్వనాథం పాల్గొన్నారు

పారదర్శకంగా ఆశా పోస్టుల భర్తీ

సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్



ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి- చింతపల్లి : ఆశా కార్యకర్తల పోస్టులు పారదర్శకంగా భర్తీ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. సిహెచ్‌డబ్ల్యుల పోస్టులను ఆశా వర్కర్లుగా మార్పు చేసి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. చింతపల్లి మండలం బలపం కోరుకొండ పిహెచ్‌సిలో ఆశ కార్యకర్తలు సిహెచ్‌డబ్ల్యులతో మంగళవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో ఇటీవల కాలంలో ఆశా కార్యకర్తల నియామలకు నోటిఫికేషన్ విడుదల చేసి ఉన్నారని, ఆ పోస్టులకు ఈ నెల 6న ఇంటర్వ్యూలు జరగనున్నాయని, వాటిని పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొంతమంది సిబ్బంది కేవలం రూ.40వేలు జీతంతో 2017 సంవత్సరం నుండి సిహెచ్‌డబ్ల్యులుగా సేవలు అందిస్తున్నారని, వారికి ఎటువంటి రాయితీలు లేకపోయినా ఆశా కార్యకర్తలతో సమానంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న సీహెచ్‌డబ్ల్యులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఆశా వర్కర్లుగా గుర్తించాలని కోరారు. గిరిజన సంఘం నాయకులు గొల్లూరి రాంబాబు, పిహెచ్సి కమిటీ నేతలు పుష్ప, సంధ్య, మత్య కొండమ్మ, రాధమ్మ, బుజ్జి, పార్వతి, పాల్గొన్నారు.

రేషన్ సరుకులు అందుబాటులోకి తేవాలని

గుర్రాలతో గిరిజనం నిరసన



గుర్రాలతో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి : మారుమూల గ్రామాల్లోని గిరిజనులకు రేషన్ సరుకులు అందుబాటులోకి తెచ్చేందుకు మినీ డియర్ రేషన్ డిపోలను ఏర్పాటు చేయాలని కోరుతూ పిన్నకోట పంచాయతీ పరిధి గుమ్మంతి గ్రామంలో మంగళవారం ఆదివాసీ గిరిజనులు గుర్రాలతో నిరసన చేపట్టారు. ఏజెన్సీ పర్యటనకు వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ మేరకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మండలంలోని మారుమూల పిన్నకోట పంచాయతీ పరిధి గుమ్మంతి గ్రామంలో మినీ డియర్ డిపో ఏర్పాటు చేస్తే పీసుమామిడి, కారకవలస, రాసకీలం, .గుమ్మంతి గ్రామాల్లోని 98 రేషన్ లబ్ధిదారులు పది కిలోమీటర్ల దూరంలో నున్న చింతపాక జిసిసి డిపో నుంచి రేషన్ తెచ్చుకునే భారం తగ్గుతుందన్నారు. అలాగే జీనబాడు పంచాయతీ కేంద్రంలోని రేషన్ డిపోకు సరుకులకు వస్తున్న ఇదే పంచాయతీలోని కొండశివారు దాయర్తి, గుమ్మం, .మద్రేబు, తునిసిబు. గ్రామాలవాసులకు దాయర్తి గ్రామంలో మినీ రేషన్‌డిపో ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గుమ్మ పంచాయతీ కడరేవు గ్రామంలో రేషన్ పాయింట్ ఏర్పాటు చేస్తే కడరేవు, కొట్టెంగుడ, సొల్లుబంగు, మరిబంధ, సింధుగులపాడు గ్రామాల రేషన్‌దారులకు మేలు జరుగుతుందన్నారు. అనంతగిరి పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో రేషన్‌డిపో ఏర్పాటు ద్వారా రాజుపాక, డెక్కపురం, లక్ష్మీ పురం, బెడ్డగుడ గ్రామాలకు, రేగం గ్రామంలో మినీ రేషన్‌డిపో ఏర్పాటుతో నందిగుమ్మి, తెల్లరపాడు, తేనెపుట్టు, మద్దిగరువు, అమలగూడ గ్రామాల కార్డుదారులకు రేషన్ కష్టాల నుంచి విముక్తి దొరుకుతుందన్నారు. ఆయా కేంద్రాల్లో మినీ రేషన్ డిపోల ఏర్పాటు ద్వారా కొండప్రాంత గిరిజనులకు ఐదు కిలోమీటర్లు నుంచి 15కిలోమీటర్లు దూరం వెళ్లి రేషన్ తెచ్చుకునే ఇబ్బందులు తొలగిపోతాయంటున్నారు. దీనిపై సంబంధిత మంత్రి నాదెండ్ల మనోహర్ తగుచర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.


మినీ రేషన్ డిపోల ఏర్పాటుకు వినతి



మంత్రికి సమస్యలను విన్నవిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

అనంతగిరి : మారుమూల గిరిజన గ్రామాల్లోని ప్రజలకు రేషన్ సరుకులు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా మినీ రేషన్‌డిపోలను ఏర్పాటు చేయాలని సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు కోరారు. మండల పర్యటనకు వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌ను హరితహిల్స్ రిసార్ట్స్‌లో కలిసి, మన్యవాసుల రేషన్ కష్టాలపై వివరించి, వినతిపత్రం అందజేశారు. మారుమూల గిరిజన గ్రామాలలో కిలోమీటర్ల దూరం కొండకోనలు ఎక్కి కాలినడకన వెళ్లి రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితులోల నాలుగైదు గ్రామాలకు ఒక రేషన్ మినీ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హాస్టల్ వసతి భవనం నిర్మించాలని,.జిఒ102 ప్రకారం భర్తీచేసిన 322 మంది జిసిసి డీలర్లకు, జిసిసి బంక్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిల్లో.మొస్యకె. సింగులు పాల్గొన్నారు

బిటి రోడ్డు నిర్మించాలని వినూత్న నిరసన



బురదరోడ్డులో మొక్కలు నాటి నిరసన

ప్రజాశక్తి -డుంబ్రిగుడ : గోరాపూర్ పెద్ద బ్రిడ్జి నుంచి ఖండ్రుం పంచాయతీ జాంకరగుడ వరకు బురదమయంగా ఉన్న రహదారిని బాగుచేసి, బిటి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ కోరారు. మంగళవారం ప్రపంచ ఆదివాసీ వారోత్సవాలలో భాగంగా జాంకరగుడలో జెండావిష్కరణ చేశారు. అనంతరం గ్రామంలో అధ్వానంగా బురదమయమైన రోడ్డును పరిశీలించారు.దమ్ముపట్టేలా ఉన్న రోడ్డులో మొక్కలు నాటి వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ మాట్లాడుతూ 2023లో ప్రారంభించిన రోడ్డు, బ్రిడ్జి నిర్మాణాలు మూడేళుల కావస్తున్నా నేటికీ పూర్తి చేయకపోవడంతో వర్షకాలంలో వర్షాలు కురవడంతో నూతన బ్రిడ్జి వరకు రోడ్డు బురదతో ప్రమాదకరంగా మారుతోందన్నారు. దీంతో వాహన దారులు ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకొని పెద్ద బ్రిడ్జి నుంచి జాంకరగుడ వరకు 800 మీటర్లు ప్రమాదభరితంగా ఉన్న మట్టి రోడ్డును బిటి రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రయాణికులు కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాంచదార్ ,టి పరన్న, కె సద్దు, కె పరశురాం, కె గేను, కె జిను పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను

రెగ్యులర్ చేయండి

7న చలో విజయవాడను జయప్రదం చేయండి : సిఐటియు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు, విద్యుత్ కార్మికులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు అల్లూరి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. మంగళవారం అరకులోయ ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం నిరంజన్ అధ్యక్షతన సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మూల వేతనం రూ.46వేలతో జీతాలు చెల్లించాలని, రూ.కోటికి బీమా కల్పించాలని, పెయిడ్ హాలీడే ఎరియర్స్‌ను, 2022 పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని, .కంప్యూటర్ ఆపరేటర్స్ ఇతర సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీమ్ రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు .మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, విద్యుత్ పంపిణీ వ్యవస్థ ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని, స్మార్ట్‌మీటర్ల బిగింపును మానుకోవాలని కోరారు. క్రార్యక్రమంలో అభి, దాసు, మంగరాజు, అప్పలరాజు పాల్గొన్నారు.

'మన మిత్ర' యాప్ సేవలపై అవగాహన



వాట్సప్ గవర్నెన్స్‌పై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- అరకులోయ: వాట్సప్ గవర్నన్స్, 'మన మిత్ర' యాప్ వినియోగంపై అవగాహనకు మంగళవారం సుంకరమెట్ట సచివాలయంలో ఎంపిడిఒ ఎ.లోవరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిడిఒ లవరాజు మాట్లాడుతూ, వాట్సాప్ గవర్నన్స్ ద్వారా 26శాఖలు, విభాగాలకు సంబంధించి 530కి పైగా సేవలు పొందవచ్చని, ప్రజలు వాట్సాప్ నెంబర్ 95523 00009 ద్వారా ఈ సర్వీసెస్ పొందవచ్చని సూచించారు. సుంకరమెట్ట పంచాయతీలో జరిగిన ర్యాలీలో ఎంపిడిఒ లవరాజు, సచివాలయ సిబ్బందితో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, గిరిజనులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

ఆశ్రమ విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ టెస్ట్

ప్రజాశక్తి - హుకుంపేట: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పాతపాడు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థినులకు మంగళవారం బ్లడ్ గ్రూపు టెస్టులు నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లాధ్యక్షులు దినేష్ కుమార్, చైర్మన్ డాక్టర్ అభిషేక్ గౌడ్ ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలతో పాటు విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్, హెచ్‌బి టెస్టులు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. బాల్య వివాహాలు, గంజాయి, డ్రగ్స్ నిర్మూలన వంటి సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం మీనాకుమారి మాట్లాడుతూ, విద్యార్థులకు బ్లడ్‌గ్రూపింగ్, హెచ్‌బి పరీక్షలతోపాటు వైద్యసేవలు అందించడం, సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం వంటి రెడ్‌క్రాస్ సొసైటీ కార్యక్రమాలతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని హర్షం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా 412 మంది విద్యార్థులకు రెండు రోజులపాటు బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన రెడ్‌క్రాస్ బృందం, వాటి సంరక్షణ బాధ్యతను ఉపాధ్యాయులకు అప్పగించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గంగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, కార్యదర్శి గౌరీశంకర్, కోశాధికారి సూర్యారావు, కార్యవర్గ సభ్యులు ప్రసాదనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి హైమావతి

మహిళా సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి హుకుంపేట

ఆదివాసీ మహిళల సమస్యలు, హక్కులు, చట్టాలు విధులు, బాధ్యతలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనకు ఈ నెల 12న ఆదివాసీ మహిళా సంఘం హుకుంపేట మండల మహాసభ నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.హైమావతి తెలిపారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో ఆదివాసీ మహిళా సంఘసమావేశంలో హైమావతి మాట్లాడుతూ ఆదివాసీ మహిళలపై హింస, విద్య, ఉపాధి, ఆరోగ్యం, ఆదివాసీల హక్కులు చట్టాలపై మహాసభలో చర్చిస్తామన్నారు. మెగాడిఎస్‌సి నుండి ఏజెన్సీ పోస్టులు మినహాయించి, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. జిఒ 3 ప్రయోజనాల పునరుద్ధరణపై సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీని ఈనెల 9, ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలోగా ప్రభుత్వం ప్రకటన చేయాలన్నారు. హుకుంపేటలో ఆదివాసీ మహిళా సంఘం మండల మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ఎస్.ప్రమీల, కె. అరుణ పాల్గొన్నారు.

శిథిల భవనంలో చదువులు!

•బిక్కుబిక్కుమంటున్న ఇరగాయి పాఠశాల విద్యార్థులు
•ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు, నేతలు



శిథిలావస్థలో ఇరగాయి పాఠశాల భవనం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండలం ఇరగాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పెచ్చులూడుతూ, చినుకుపడితే లోపలంతా చిత్తడిమారిన భవనంలో బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు చదువులు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని అటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురౌతున్నారు.

ఇరగాయి పాఠశాలలో ఒకటి తరగతి నుంచి 5వ తరగతి వరకు 27 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి పెచ్చులూడి, కింద పడుతుండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వర్షం వస్తే వర్షపు నీరు తరగతి గదిలో నీరు నిలిచిపోతుంది. గతంలో నాడు-నేడు పథకంలో విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని పాలకులు గొప్పలు చెప్పినా ఇరగాయి పాఠశాల భవనం దుస్థితిని మాత్రం ఎవ్వరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వ అధికారులకైనా వర్షిన తరాల్లోనైనా ఇరగాయి పాఠశాల భవనం దుస్థితిని దృష్టిసారించి, తక్షణమే నిధులు మంజూరుచేసి, కొత్త భవనాన్ని నిర్మించాలని వేడుకుంటున్నారు.

ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి- పెదబయలు

అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ తమ్మర్ల విశ్వేశ్వరరావునాయుడు మంగళవారం మండలంలోని పలు ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ముందుగా పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కిముడుపల్లి సబ్ సెంటర్‌లో ఎన్‌సిపిఎస్ (104) వైద్య శిబిరాన్ని సందర్శించారు. తల్లిబిడ్డ సంరక్షణ, బీపీ, షుగర్ పేషెంట్లకు తనిఖీలు, గర్భిణీలు హాస్పిటల్లో డెలివరీ వంటిపై వాటిపై తగు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి గౌరి నిఖిల్‌ను ఆదేశించారు. మలేరియా టైఫాయిడ్, డెంగూ వంటి జ్వరాలు గురించి ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ ఇంటి లోపల ఐఆర్ఎస్ మలేరియా స్ప్రేయింగ్ చేయించుకోవాలని, దోమతెరలు వాడాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు తనిఖీ చేశారు. అనంతరం గోమంగి, రుడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశా కార్యకర్తలతో సమావేశమయ్యారు. గర్భిణులకు వైద్య సేవలు, సీజనల్ వ్యాధులకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. వ్యాక్సిన్ రిజిస్టర్లు, డెలివరీ రిజిస్టర్లు, మలేరియా ల్యాబ్ రిజిస్టర్, డ్రగ్ స్టోర్ రిజిస్టర్లు, స్టాఫ్ నర్స్ విధుల తదితర వాటిని తనిఖీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం చేస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయపాలన విధిగా పాటించాలన్నారు. ప్రతినెల 9వ తేదీన ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం జరుగుతుందని, ఇందులో గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేయాలని సూచించారు. ఆగస్టు 12న నేషనల్ డీ వార్మింగ్ డే సందర్భంగా అన్ని స్కూళ్లు, కాలేజీలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న నుండి 19 సంవత్సరాల వయస్సు వారికి ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ఉచితంగా మింగించడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పెదబయలు డాక్టర్ జి నిఖిల్, గోమంగి డాక్టర్ టి.చైతన్య, రుడకోట డాక్టర్ పి.సత్యారావు, సంజీవ్ పాత్రుడు ఎంపీహెచ్ఈఓ లక్ష్మణ్, ఎంపీహెచ్ఎస్, సింహాద్రి ఎంపీహెచ్ఎస్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



రూడకోట పిహెచ్‌సి సిబ్బందితో డిఎంహెచ్‌ఒ విశ్వేశ్వరరావు నాయుడు

తల్లిపాలు శిశువు జన్మహక్కు

ప్రజాశక్తి-చింతపల్లి : పుట్టిన ప్రతి శిశువుకు తల్లిపాలు జన్మహక్కు అని ఐసిడిఎస్ సూపర్వైజర్ డి.విజయభారతి అన్నారు. తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా మంగళవారం చింతపల్లి-2 అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని తెలిపారు. కనీసం ఆరు నెలల పాటు శిశువుకు క్రమం తప్పకుండా తల్లిపాలను ఇవ్వడం వల్ల శిశువు వ్యాధినిరోధక శక్తి పెరిగి, ఎదుగుదల సమర్ధవంతంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



రైతు సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త

సాగు, సస్యరక్షణపై సూచనలు

ప్రజాశక్తి-జి మాడుగుల : స్థానిక సచివాలయంలో మంగళవారం రైతు సదస్సు నిర్వహించారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త బాల హుస్సేన్ రెడ్డి మాట్లాడుతూ, అల్లూరి జిల్లాలో నేలలు, వాతావరణ, భౌగోళిక పరిస్థితులు వివిధ రకాల పంటల సాగుకు మైదాన ప్రాంతం కన్నా అనువుగా ఉన్నా, సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్లే ఆశించిన దిగుబడులను గిరిజన రైతులు సాధించలేకపోతున్నారన్నారు. మార్కెట్లో దొరికే గుర్తింపు లేని ఎరువులు వాడటం ప్రధాన కారణమైతే, సాగుయాజమాన్యంపై పూర్తి అవగాహన లేకుండా పనులు చేయడం వల్లే దిగుబడులు సాధించలేకపోతున్నారన్నారు. ఎఒ వరప్రసాద్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ ఆర్థికసాయం కొందరు రైతులకు అందకపోవడంపై సమీక్షించారు. తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్‌చార్జి మత్స్యరాస నారాయణరాజు మాట్లాడుతూ గిరిజన ప్రాంత రైతులకు మేలు చేకూర్చడానికి కూటమి ప్రభుత్వం అనే కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జి మాడుగుల సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపిటిసి కొర్ర ఈశ్వరరావు, టిడిపి పంచాయతీ అధ్యక్షులు కూడా వివిఎస్ ప్రసాద్ మాజీ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ లకే బలయ్యా దొర, పీసా కమిటీ మండల అధ్యక్షులు లకే రామకృష్ణ, పీసా కమిటీ అధ్యక్షుడు కిముడు మణికంఠ, సచివాలయం సిబ్బంది, అనుబంధ సంఘాలు, పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

చింతపల్లి : రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు వెంటనే జారీ చేయాలని, జర్నలిస్టుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యాన తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చింతపల్లి ప్రెస్ క్లబ్ నాయకులు దేశెట్టి సతీష్, దయానంద్, కాసిం వల్లీ, చింతపల్లి మండల పాత్రికేయులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-చింతపల్లి : గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చింతపల్లి పోలీసుశాఖ ముమ్మర తనిఖీలు చేపట్టింది. మంగళవారం చింతపల్లి టి.జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల్లో బస చేస్తున్న మైదాన ప్రాంతాలకు చెందిన గంజాయి ముఠా అల్లూరి జిల్లా ఏజెన్సీ మార్గంగా గంజాయిని తరలిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందిందని తెలిపారు. దీనిపై స్పందించిన పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అన్ని మార్గాల్లో తనిఖీలను ముమ్మరం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హోంగార్డు జర్సింగి విశ్వనాథం, ఏపీఎస్పీ సిబ్బంది, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు




ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

అన్ని పంచాయతీల్లో మనమిత్ర ర్యాలీలు

ప్రజాశక్తి - మారేడుమిల్లి : ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో మనమిత్ర ర్యాలీలు అన్ని పంచాయతీలలో జరిపామని ఎంపిడిఒ తూతిక శ్రీనివాసవిశ్వనాథ్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 9552300009 మనమిత్ర వాట్సాప్ నెంబరును విస్తతంగా ప్రచారం చేశామన్నారు. ముఖ్యంగా మనమిత్ర వాట్సాప్ నంబరు ద్వారా 550 ప్రభుత్వసేవలను ఉచితంగా పొందవచ్చని ఎంపిడిఒ తెలిపారు. అనంతరం ప్రధానకూడలిలో సిబ్బంది మానవహారం నిర్వహించారు. జెడ్‌పిటిసి, వైస్ ఎంపిపి, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల పోస్టులకు 8న ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 8వ తేదీన ఉదయం 10 గంటలకు చింతూరు ఐటిడిఎ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని పిఒ అపూర్వ భరత్, ఒక ప్రకటనలో తెలిపారు. ఆశా కార్యకర్తల నియామకానికి సంబంధించి ప్రొవిజినల్‌లిస్ట్ కూడా ఆరోగ్యకేంద్రాల ద్వారా తెలియచేశామన్నారు. అభ్యర్థులు 8వ తేదీ ఉదయం 10 గంటల లోపు ఐటిడిఎ నందు ఏర్పాటు చేయబడిన రిజిస్టర్‌లో తమ హాజరు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.



బాలికకు నగదు అందిస్తున్న పాఠశాల చైర్మన్ విజయ్, హెచ్‌ఎం తదితరులు

బాలికకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని పల్లూరు గ్రామానికి చెందిన సవలం అనూహ్య గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. స్థానిక మర్రిగూడెం పాఠశాలలో అనూహ్య తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమె తల్లితండ్రులు సునీత, ముత్తయ్య పేద కుటుంబం. మర్రిగూడెం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు రూ.38 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ మొత్తాన్ని పాఠశాల చైర్మన్ జగిని విజయ్, హెచ్‌ఎం వెంకటరావు, సిబ్బంది కలిసి బాలికకు అందజేశారు.

విశాఖలో విఐ 5జి సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ప్రముఖ టెలికాం నెట్వర్క్ విఐ తమ 5జి సేవలను విశాఖపట్నంలో అందుబాటులోకి తెస్తున్నట్టు వొడాఫోన్ ఐడియా ఎపి, తెలంగాణ రీజియన్ బిజినెస్ హెడ్ దీపక్‌రావు తెలిపారు. మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తమకు 5జి స్పెక్ట్రం ఉన్న 17 ప్రయారిటీ సర్కిల్స్‌లోని పలు నగరాల్లో 5జి సేవలను ప్రవేశపెట్టే ప్రక్రియలో భాగంగా విశాఖలో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. దశలవారీగా 5జి విస్తరణలో భాగంగా విఐ ఇప్పటికే ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి పలు 5జి సేవలను ప్రవేశపెట్టిందన్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో వీఐ కొత్తతరం కనెక్టివిటీని పొందే మొదటి నగరంగా విశాఖపట్నం నిలుస్తుందన్నారు. విశాఖపట్నం, తిరుమలలో 5 జిఎనేబుల్డ్ డివైజ్‌లు గల విఐ యూజర్లు మంగళవారం నుంచి 5జి సర్వీసులను పొందవచ్చన్నారు. ప్రారంభ ఆఫర్ కింద రూ. 299 నుంచి మొదలయ్యే ప్లాన్లపై విఐ తమ యూజర్లకు అన్‌లిమిటెడ్ 5జి డేటాను అందిస్తోందని, కస్టమర్లు హైడెఫినిషన్ స్ట్రీమింగ్, గేమింగ్, రియల్-టైమ్ క్లౌడ్ యాక్సెస్ మొదలైన వాటిని ఆస్వాదించవచ్చు అన్నారు.

రబ్బర్ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - మారేడుమిల్లి: ఏజెన్సీలో రబ్బర్ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒకట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం మారేడుమిల్లి మండలం దేవరపల్లి గ్రామంలో రబ్బర్‌బోర్డ్ రబ్బర్ ప్రొసెసింగ్ యూనిట్ ప్రాంగణంలో ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, కేరళ రాష్ట్రం కొట్టాయం రబ్బర్ బోర్డు కమిషనర్ సుజి, రబ్బర్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వసంత్ గేసన్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని గిరిజనులు రబ్బర్ మొక్కలు వేసుకుని వారి ఆర్థికస్థితిగతులు మార్చుకునే విధంగా రబ్బర్‌బోర్డు సహకారం అందించాలన్నారు. వచ్చే సంవత్సరం నుండి రబ్బర్ నర్సరీ ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులు రబ్బర్ ప్రొసెసింగ్ రోలర్స్ కావాలని తన దృష్టికి తీసుకువచ్చారని రోలర్లు ఎక్కడ ఏర్పాటు చేయాలో గుర్తించి చర్యలు చేపడతామన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వసంతగేసన్ మాట్లాడుతూ రాష్ట్రంలో రంపచోడవరం ప్రాంతంలోనే రబ్బర్ ప్లాంటేషన్ ఉందని ఇక్కడే ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. కేరళ నుండి ఈ ప్రాంతానికి ఒక్క రబ్బర్ మొక్క తీసుకురావాలంటే రూ.102 నుంచి రూ.104 ఖర్చవుతుందని ఈ ప్రాంతంలోనే రబ్బర్ నర్సరీ ఏర్పాటు చేస్తే ఒక మొక్కకు 40 నుంచి 50 రూపాయలు ఖర్చవుతుందన్నారు. రైతులకు రబ్బర్‌పాలు ఏ విధంగా తీయాలో క్షుణ్ణంగా తెలుసుకునే విధంగా రైతులకు శిక్షణ ఇస్తారన్నారు. రబ్బర్‌షీట్లు తయారు చేసే విధంగా సైంటిస్టులు పరిశోధనలు చేసి పనిచేయడం జరిగిందన్నారు. ఏడు సంవత్సరాలు జాగ్రత్తగా మొక్కలను సంరక్షిస్తే 40 సంవత్సరాల పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. రబ్బరు తోటల్లో అంతరపంటలు కూడా సాగు చేయవచ్చన్నారు. రైతుల సమస్యలు ఏమైనా ఉంటే బోర్డు అధికారులకు సంప్రదించాలన్నారు. కేరళ రాష్ట్రం కొట్టాయం రబ్బర్ బోర్డ్ కమిషనర్ డాక్టర్ సుజి మాట్లాడుతూ రబ్బర్ మొక్కలకు ఎప్పటికప్పుడు ఎరువులు వేసుకుంటూ సంరక్షించుకున్న ఎడల రానున్న తరాల వారికి మంచి భవిష్యత్తు ఇవ్వవచ్చని తెలిపారు. రబ్బర్ పాలు ఎలా తీయాలో రైతులకు కొట్టాయంలో శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రబ్బర్‌బోర్డ్ జాయింట్ డైరెక్టర్ పి.ఆర్ముగం, జడ్పిటిసి సభ్యులు గొర్లె బాలాజీబాబు, రబ్బర్‌బోర్డు ఎడిఒలు సుశాంత్ కుమార్ నాయక్, డాక్టర్ సుశీల్ కుమార్, పిహెచ్ఒ దేవదానం, గోవిందస్వామి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిఒ సింహాచలం

ఏజెన్సీ టీచర్ పోస్టులను ఆదివాసీ అభ్యర్థులతో భర్తీ చేయాలి

9న ఆదివాసీ పండగ విజయవంతం చేయాలి
ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు సీసం సురేష్

ప్రజాశక్తి-మోతుగూడెం / చింతూరు : మెగా డిఎస్‌సిలో టీచర్ పోస్టులను ఆదివాసీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. చింతూరు మండలం, అల్లిగూడెం, మోతుగూడెం కేంద్రాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగస్టు 9న ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల వేదిక కోయితోర్ పండుం దక్కూడ్ కూనవరం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ముందస్తు జెండా ఆవిష్కరణలు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీసం సురేష్ మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, చట్టాలు అమలు ప్రభుత్వ విధానాలు రోజు రోజుకీ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని బిజెపి తన హిందుత్వ విధానాన్ని ఆదివాసీ సంస్కృతిలో చొప్పించాలని ప్రయత్నం చేస్తోందన్నారు. పోలవరం నిర్వాసితులకు భూ పరిహారం ఆర్ అండ్ఆర్ విషయంపై స్పష్టత ఇచ్చి నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు కారం నగేష్, కారం సుబ్బారావు, పాండు నాగార్జున, పొడెం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సీసం సురేష్, తదితరులు

కళాశాలలో లెక్చరర్స్‌ను నియమించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ జెఎసి రాష్ట్ర కోర్ కమిటి సభ్యులు శ్రీనివాస్

ప్రజాశక్తి - దేవీపట్నం:

దేవీపట్నం మండల పరిధిలోని దామనపల్లి (ముసుళ్ళకుంట) ఆశ్రమ జూనియర్ కళాశాలలో తక్షణమే లెక్చరర్స్‌ను నియమించాలని ఎపి ఆదివాసీ జెఎసి రాష్ట్ర కోర్ కమిటి సభ్యులు కంగల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దామనపల్లి బాలికల ఆశ్రమ జూనియర్ కళాశాలలో మొత్తం 62 మంది ఎంపిసి, బైపిసి చదువుతున్న విద్యార్థులకు లెక్చరర్స్‌ను నియమించలేదన్నారు. దీంతో తరగతులు జరగక వారు ఆందోళన చెందుతున్నారని ఐటిడిఎ పిఒ, కలెక్టర్ స్పందించి లెక్చరర్స్‌ను నియమించాలని ఎపి ఆదివాసీ జెఎసి రాష్ట్ర కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎపి ఆదివాసీ జెఎసి రాష్ట్ర నాయకులు తెల్లంశేఖర్, యలగాడ నాగేశ్వరావు, పొడియం పండు దొర, డి.కనకదుర్గ, తుర్రం జగదీష్‌దొర పాల్గొన్నారు.

అడ్డతీగల ఇన్‌ఛార్జి ఎంఇఒగా రమేష్

ప్రజాశక్తి - అడ్డతీగల : స్థానిక మండల ఇంచార్జ్ ఎంఇఒగా రమేష్ మంగళవారం బాధ్యత స్వీకరించారు. ఎమ్మార్సీ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సత్కరించారు. జోగేశ్వరరావు జిహెచ్‌ఎం రాంబాబు, సిహెచ్ చిన్నబ్బాయి టీచర్ జి వెంకటరావు తదితరులు పాల్గొన్నారని ఎంఇఒ 2 శ్రీనివాస్ తెలియజేశారు.

ఆలయ ప్రాంగణంలో మద్యం తాగితే కఠినచర్యలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం దారకొండ పంచాయతీ దారాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మద్యం తాగితే చట్టపరమైన చర్యలు తప్పవని సీలేరు ఎస్ఐ రవీంద్ర హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మంగళవారం మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం చట్టరీత్యా నేరమని తెలిపారు. దారాలమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని ఆలయ ప్రాంగణంలో మద్యం తాగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పోస్టర్లను ఆలయ పరిసరాల్లో తమ సిబ్బందితో అతికించామన్నారు.



పోస్టర్లు అతికిస్తున్న సిబ్బంది

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జూలై 2025 విద్యాసంవత్సరానికి గానూ వివిధ దూరవిద్యా కోర్సులతో పాటూ ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆగష్టు 15వ తేదీ వరకూ గడువు పొడిగిస్తున్నామని సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. విశ్వ విద్యాలయం అందిస్తున్న డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, అన్ని పిజి కోర్సుల్లో ఆగస్టు 15 వ వరకు ప్రవేశాలు లభిస్తాయన్నారు. ఇగ్నో వెబ్‌సైట్‌లో అడ్మిషన్ల లింక్ https://ignouadmission.samarth.edu.in ద్వారా అడ్మిషన్లు పొందవచ్చునని ఆయన తెలిపారు. ప్రవేశాలన్నీ ఆన్లైన్ విధానంద్వారా మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఫీజులు కూడా ఆన్లైన్ ద్వారానే కట్టాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్ చూడవచ్చు.

కెకె లైన్‌లో పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : వాల్తేరు డివిజన్‌లోని కొత్తవలస పెందుర్తి సెక్షన్లో ఆధునీకరణ పనుల కారణంగా ఆగస్టు 6 నుండి 9 వరకు పలురైళ్లు రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 18526 విశాఖపట్నం - బ్రహ్మపూర్ ఎక్స్ ప్రెస్‌ను ఆగష్టు 6 నుండి 8 వరకు, 18525 బ్రహ్మపూర్ - విశాఖపట్నం ఎక్స్ ప్రెస్ ఆగష్టు 7 నుండి 9 వరకు రద్దు చేసారు.

'ది డెక్'లో జార్జియన్ విశ్వ విద్యాలయ కార్యాలయం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: యూరోప్‌లోని ప్రఖ్యాత జార్జియన్ విశ్వవిద్యాలయం రాష్ట్రంలో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు వీలుగా విఎంఆర్డిఎకు చెందిన ఐకానిక్ బిల్డింగ్ 'ది డెక్'లో 3వ అంతస్తు నందు కార్యాలయం ప్రారంభించే దిశగా అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు విఎంఆర్డిఎ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ , కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తో జార్జియా నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధులు మంగళవారం ఒప్పందం కుదుర్చుకున్నారు. జార్జియాన్ నేషనల్ యూనివర్సిటీ కో- ఇన్వెస్టర్ చిరాగ్ వఘేలా, ఇండియా ఆపరేషన్స్ డైరెక్టర్ వివేకానందమూర్తి, సలహాదారుడు విన్నీ పాత్రో, విఎంఆర్డిఎ జాయింట్ కమిషనర్ రమేశ్, కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ : సంపూర్ణ ఆరోగ్యం పొందడానికి జీవనశైలిలో మార్పులతో పాటు, పోషకాహారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని న్యూట్రిషన్ అండ్ వెల్నెస్ కన్సల్టెంట్, షీలా కృష్ణస్వామి అన్నారు. నగరంలోని ఓ హోటల్లో జీవనశైలి పోషకాహారం అనే అంశంపై జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ కాలిఫోర్నియా బాదం వంటి పోషకాహారాలను రోజువారీ ఆహారంలో చేర్చడం ద్వారా ఆరోగ్యం మనచేతిలో ఉన్నట్టే అన్నారు. పోషకాల గని బాదం అని, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంతో పాటు ఎల్‌డిఎల్, టోటల్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడం వరకు తోడ్పాటును అందిస్తుందన్నారు. ఇటీవల ఐసిఎంఆర్ విడుదల చేసిన ఆహార మార్గదర్శకాలు మొక్కల ప్రోటీన్ మరియు దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని అందించే రోజువారీ, ఆరోగ్యకరమైన ఎంపికగా బాదంపప్పును వెల్లడించాయన్నారు.